## ఎంసీసీ క్వారీలోకి జింకలు



తిమ్మాపూర్ బీట్‌లో జింకలను వదిలి పెడుతున్న ఫారెస్ట్ అధికారులు

హాజీపూర్, జనవరి 7 : లక్షెట్టిపేట ఫారెస్టు సెక్షన్ పరిధిలోని తిమ్మాపూర్, పాత మంచిర్యాల బీట్‌లలోని ఎంసీసీ క్వారీలో ఏర్పాటు చేసిన జంగిల్ సఫారీలో పర్యాటకులకు కనువిందు చేసేందుకు జింకలను తీసుకువచ్చి వదిలినట్లు అటవీశాఖ అధికారి సర్వేశ్వర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లాలోని జింకల పార్క్ నుంచి 14 జింకలను తీసుకువచ్చి జంగిల్ సఫారీలోని గడ్డి మైదానాల్లో వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ హతవుల్లా, అల్తాఫ్, పాత మంచిర్యాల బీట్ ఆఫీసర్ రాజేందర్, తిమ్మాపూర్ బీట్ ఆఫీసర్ సంతోష్ ఉన్నారు.

## జీవో నం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 7: ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కమిషనర్ భుజంగ్‌రావుకు మున్సిపల్ కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటి ఏర్పడి 11నెలలు అవుతున్నా.. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. 15 రోజుల్లో చెల్లించకుంటే సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. ఇక్కడ మున్సిపల్ యూనియన్ నాయకులు రాజు, సమ్మయ్య, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ప్రభాకర్, లక్ష్మి, జగదీశ్, సంధ్య, పెంటు బాయి, పద్మ, బాలేశ్, ప్రభాకర్, జగదీశ్, నరేశ్, దుర్గయ్య, శంకర్ ఉన్నారు.



రామారావుపేటలో రైతుభరోసా బకాయిల పోస్టర్లు అంటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలి

- రైతు భరోసా బకాయిలను మొత్తం చెల్లించాలి
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నిరసనగా బైక్ ర్యాలీ

జైపూర్, జనవరి 7: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద యేటా ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందంటూ బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజారమేశ్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని రామారావుపేటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. మండలంలోని ఇందారం, టేకుమట్ల, శెట్‌పల్లి, కుందారం, వేలాల, పౌనూర్, శివ్వారం గ్రామాల మీదుగా ర్యాలీ సాగింది. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నదని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల చొప్పున చెల్లించాలని, రైతులకు రావాల్సిన బకాయిలకు మొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోస్టర్లు అంటించారు. 6 గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల నాయకులు మేడి తిరుపతి, జగన్‌గౌడ్, చెన్ను, కొరివి శేఖర్ యాదవ్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎందుకీ నిర్బంధం

- ముల్కల్ల రైతులను బలవంతంగా ఎమ్మెల్యే మీటింగ్‌కు తీసుకెళ్లారనే ఆరోపణలు
- బీఆర్ఎస్ నాయకులు వస్తున్నారని తెలిసి హడావుడిగా మరో మీటింగ్‌కు ఏర్పాట్లు
- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎవరూ కలవకుండా తరలించారంటున్న రైతులు
- గ్రామంలో వీధికో పోలీస్ వాహనం తిరిగిందంటూ చెబుతున్న స్థానికులు
- అర్జున్ అరెస్టుతో భయపడి బయటికి రాలేదంటూ వాపోయిన వైనం

### వివాదాస్పదమవుతున్న ఇండస్ట్రియల్ హబ్ భూ సేకరణ

మంచిర్యాల, జనవరి 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హాజీపూర్ మండలంలోని వేంపల్లి, పోచంపాడు, ముల్కల్ల గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం 276.09 ఎకరాల భూసేకరణ వివాదాస్పదమైంది. భూములు కోల్పోయే పేదలను అధికార పార్టీ లీడర్లు బెదిరించి సంతకాలు తీసుకున్నారంటూ రైతులు చెప్పడం.. నోటిఫికేషన్ రాకుండానే నిబంధనలకు విరుద్ధంగా రహస్య సమావేశం నిర్వహించి ఆర్డీవో, ఎంఆర్వో సాక్షిగా సంతకాలు తీసుకోవడం రాష్ట్రవ్యాప్తంగా దుమారం లేపింది. ఈ నేపథ్యంలో రైతులను కలిసి విషయం తెలుసుకునేందుకు బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం మంచిర్యాలకు వచ్చారు. ఆయన పర్యటన సోమవారం సాయంత్రం ఖరారైన నేపథ్యంలో రైతులందరూ ఆయనను కలవాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సాయంత్రం మంతనాలు చేసుకుని తమ గోడు వెళ్లబోసుకునేందుకు సిద్ధమయ్యారు. కానీ.. తెల్లారే సరికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రైతుల పక్షాన ఉంటూ అధికారులను నిలదీస్తూ.. నష్టపరిహారం విషయంలో జరుగుతున్న అన్యాయంపై అందరిలో చైతన్యం తీసుకొస్తున్న దొమ్మటి అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే సమావేశాలు ఉన్న నేపథ్యంలో ఎలాంటి గొడవలు కాకుండా ముందు జాగ్రత్తగా ఆయన్ని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కానీ అర్జున్ అరెస్టుతో బయటికి రావాలంటేనే భయం వేసిందని రైతులు చెప్పుకొచ్చారు.

#### వాహనాలు పెట్టి తరలింపు..

అర్జున్ అరెస్టు అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీటింగ్‌కు పోటీగా హడావుడిగా రైతులందరితో ఎమ్మెల్యే పీఎస్ఆర్ ఆధ్వర్యంలో మంచిర్యాల పద్మనాయక గార్డెన్‌లో మరో మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో ఉదయాన్నే బాధిత రైతుల ఇళ్లకు వెళ్లి మరీ ముల్కల్లలోని సీనియర్ కాంగ్రెస్ లీడర్ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి వాహనాలు ఏర్పాటు చేసి మరీ వారందరినీ మంచిర్యాలకు తరలించారు. ముల్కల్ల గ్రామంలో ఉదయం నుంచి పోలీస్ వాహనాలు తిరుగుతూ బయటికి వచ్చిన రైతులకు ఎక్కడికి వెళ్తున్నారు. ఎమ్మెల్యే మీటింగ్‌కా లేకపోతే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మీటింగ్‌గా.. అని ఆరా తీసినట్లు స్థానికులు చెప్పారు. ఎమ్మెల్యే మీటింగ్‌కే లోకల్ లీడర్ ఇంటికి వెళ్తున్నామని చెప్తే వదిలేశారంటున్నారు. గల్లీకో పోలీస్ మఫ్టీలో తిరగడంతో బయటికి రావాలంటేనే భయమేసిందని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సార్ వచ్చారని తెలిశాకే బయటికి వచ్చి ఆయన మాట్లాడామని చెప్పుకొచ్చారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో నిర్బంధం చూడలేదని, రాత్రి ప్రవీణ్‌కుమార్ సార్‌ను కలవడానికి వస్తామని చెప్పిన రైతులను మంచిర్యాలలో ఎమ్మెల్యే మీటింగ్‌కు తీసుకెళ్లారని వాపోయారు. ఏం తప్పు చేయకపోతే, బెదిరించి సంతకాలు తీసుకుని, ఎందుకు ఇంత నిర్బంధంగా రైతులను మీటింగ్‌కు తీసుకెళ్లారో సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు వచ్చి ఓట్లు అడిగిన ఎమ్మెల్యే ఇప్పుడు గ్రామపంచాయతీ దగ్గరకి వచ్చి మాతో మాట్లాడి భూములు అడిగేందుకు ఎందుకు భయపడుతున్నారో చెప్పాలన్నారు.

#### మీటింగ్‌పై అనుమానాలెన్నో.. ..



ముల్కల్లలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావును కలిసి తమ బాధ చెప్పుకుంటున్న బాధితులు

రైతులందరినీ బలవంతంగా ఎమ్మెల్యే మీటింగ్‌కు తీసుకెళ్లారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందు స్థానిక లీడర్ ఇంట్లో రైతులతో మాట్లాడారని, అనంతరం సమావేశానికి తీసుకెళ్లారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు భూములు ఇవ్వడానికి మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారా.. లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ వచ్చాక రైతులతో సమావేశాలు పెట్టి, పరిహారం గురించి వారికి వివరించి, సంతకాల సేకరణ చేసి ఉంటే ఇలాంటి అనుమానాలకు తావుండేది కాదు. కానీ అలాంటిదేమీ లేకుండా అధికార పార్టీ లీడర్లు హడావుడి చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాక కూడా ఎందుకు తొందర పడుతున్నారన్నది అర్థం కావడం లేదు. పైగా భూములు ఇచ్చేందుకు ఒప్పుకుంటే నెల రోజుల్లో డబ్బులు మీ ఖాతాల్లో వేస్తామంటూ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అసలు నోటిఫికేషన్ రాకుండానే పరిహారం ఎలా ఇస్తారు. అది నిబంధనలకు విరుద్ధం కాదా.. పైసలే లేవని చెప్తున్న సర్కార్ ఇంత త్వరగా భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఎలా ఇస్తుందనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో కలగజేసుకుని ఇప్పటి వరకు జరిగిన సమావేశాలు అధికారికంగా జరిగాయా? లేదా? నోటిఫికేషన్ రాకుండా పరిహారం ఫైనల్ చేయడం, రైతుల సంతకాలు తీసుకోవడం చేయవచ్చా? లేదా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



లగ్గాం గ్రామంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

## ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

**కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్**

దహెగాం, జనవరి 7: వారం రోజుల్లో వరిధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ డేవిడ్(రెవెన్యూ) ఆదేశించారు. మంగళవారం దహెగాం మండలంలోని లగ్గాం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. దహెగాంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాల పరిధిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో చేపట్టినందున వాటిని మూసివేయాలని సహకార సంఘం కార్యదర్శి తుమ్మిడ నారాయణకు సూచించారు. లగ్గాం గ్రామంలో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు కూడా నాణ్యమైన ధాన్యం అందించాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేవించారు. ఆయన వెంట డీసీవో బిక్కునాయక్, తహసీల్దార్ దామెర కవిత, ఏఈవో వంశీ, సీఈవో నారాయణ, కల్లాల ఇన్‌చార్జి జీవన్ పాల్గొన్నారు.

## వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి



విజేతలకు బహుమతులను అందజేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

దహెగాం, జనవరి 7: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన ఆదేశాల మేరకు గిరివెల్లిలో బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మొదటి స్థానంలో నిలిచిన గిరివెల్లి జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు జ్ఞాపిక, ద్వితీయ స్థానంలో నిలిచిన మంచిర్యాల జిల్లా కన్నెపల్లి జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు జ్ఞాపికను అందజేశారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కందూరి రాజు, బీఆర్ఎస్ నాయకులు దందెర మల్లేశ్, ఆవుల రాజ్‌కుమార్, రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

#### గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కన్నెపల్లి, జనవరి 7 : కన్నెపల్లి మండలంలోని గ్రామాల్లో సమస్యలు అధికారులు పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని అయితపల్లి, సాలిగాం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాలిగాం గ్రామం నుంచి నాయకుడిపేట వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, నల్లవాగుపై బ్రిడ్జి నిర్మించాలని, సాలిగాం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరారు. సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు న్నారు.

## లాభాపేక్ష లేకుండా 'ఐఆర్‌సీఎస్' సేవలు

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**



జెండా ఊపి బ్లడ్ డొనేషన్ క్యాంపర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అర్బన్, జనవరి 7: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలందిస్తున్నామని మంచిర్యాల కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని సున్నంబట్టివాడలోని ఆనంద నిలయంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీకి అందించిన బ్లడ్ డొనేషన్ క్యాంపర్ వాహనాన్ని ఐవోసీఎల్. డీజీఎం. కైలాస్‌కాంత్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా సేవలందుతున్నాయని, జిల్లాలోని డయాలసిస్, సికిల్‌సెల్, తలసేమియా రోగులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సమయాల్లో అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐవోసీఎల్. రాష్ట్ర ఈడీ అండ్‌ఎస్‌హెచ్‌బీ అనిల్‌కుమార్ సహకారంతో సీఎస్ఆర్ నిధుల నుంచి రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రానికి రూ.50 లక్షల విలువైన బ్లడ్ డొనేషన్ క్యాంపర్ బొలెరో వాహనం, ఆటోమేటెడ్ ఎలిసా ప్రాసెసర్, రీడర్, బ్లడ్ కనెక్షన్ మానిటర్, బ్లడ్ ట్యూబ్ సిలర్, బ్లడ్ స్టోరేజ్ రిఫ్రిజిరేటర్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఐవోసీఎల్ డీజీఎం మాట్లాడుతూ మంచిర్యాలలోనే కాకుండా మరో 5 జిల్లా ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధుల నుంచి తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ రామగుండం ఇన్‌చార్జి ఆసిఫ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన

మందమర్రి, జనవరి 7 : జాతీయ ఆరోగ్య మిషన్, వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీశ్ రాజ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా మందమర్రి, కాసిపేట, దండేపల్లి, తాళ్లపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో సాంస్కృతిక కళాకారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు మంగళవారం మందమర్రి మార్కెట్ ఏరియాలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 100 శాతం గర్భిణుల నమోదు, టీకాల కార్యక్రమం, వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిస్థితి, తదితర కార్యక్రమాల గురించి అవగాహన చెప్పట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేశ్, డెమో బుక్క వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచారాన్ని ప్రారంభిస్తున్న మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

## ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

**సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి**



ఉత్పత్తిపై అధికారులతో చర్చిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

సీసీసీ నస్పూర్, జనవరి 7: ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడు నెలల్లో సంస్థ నిర్దేశిత లక్ష్యాలను సమష్టిగా సాధించాలని సింగరేణి ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ జీఎం ఎల్‌వీ సూర్యనారాయణతో కలిసి శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్చిలోగా లక్ష్యాలను సాధించాలని అధికారులు, కార్మికులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఓసీపీ ప్లాన్‌ను పరిశీలించి క్వారీలోని కోల్ బెంచ్‌లను, అప్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఉత్పత్తి పెంపుదల కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఓసీపీలో ఓబీ తవ్వకాలు చేపడుతున్న జీవీఆర్, సీఆర్ఆర్ కాంట్రాక్ట్ కంపెనీలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ పీవో శ్రీనివాస్, ఇందారం ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

#### ఇందారం ఓసీ సందర్శన

జైపూర్, జనవరి 7: జైపూర్ మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని జీఎం సూర్యనారాయణతో కలిసి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సందర్శించారు. క్వారీలోకి వెళ్లే కోల్ బెంచ్, అప్ లోడింగ్ ప్రదేశాలను పరిశీలించి ఉత్పత్తి పెంపుదలకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఓబీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, ప్రాజెక్టు ఇంజినీర్, రామకృష్ణారావు, ఎస్వో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పదేండ్లలో తీసెయ్యని కరెంటును ఇప్పుడెందుకు కట్ చేసిండ్రు ?

- రిటైర్డ్ కార్మికుల ఆగ్రహం
- సింగరేణి క్వార్టర్లకు విద్యుత్‌ను పునరుద్ధరించాలని రాస్తారోకో



బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న రిటైర్డ్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి, జనవరి 7 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పదేండ్లలో తొలగించని సింగరేణి విద్యుత్‌ను ఇప్పుడు ఎందుకు కట్ చేశారని సింగరేణి రిటైర్డ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీ, హన్మాన్ బస్తీలోని సింగరేణి క్వార్టర్లకు విద్యుత్‌ను సింగరేణి యాజమాన్యం తొలగించడంతో రిటైర్డ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాంటా చౌరస్తాలో రిటైర్డ్ కార్మికులు వారి కుటుంబ సభ్యులు రాస్తారోకో చేశారు. సింగరేణి యాజమాన్యం వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. క్వార్టర్లకు విద్యుత్‌ను తొలగిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్మిక కుటుంబాలు విద్యుత్ కోసం అష్టకష్టాలు పడుతుంటే హైదరాబాద్‌లో ఏసీ రూముల్లో ఉంటూ చోద్యం చూస్తున్నాడని ఆరోపించారు. చీకట్లో దోమలు, పాములు, విషపురుగులతో ఇబ్బంది పడుతున్నామని రిటైర్డ్ కార్మికుడి భార్య మల్లక్క ఆవేదన వ్యక్తం చేసింది. 30నుంచి 40 సంవత్సరాల పాటు సింగరేణిలో పని చేసిన తన భర్త పక్షవాతం వచ్చి ఇంట్లో ఉన్నాడని, కరెంటు లేకపోతే ఎట్ల బతుకుతాడని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, సర్కారు స్పందించి క్వార్టర్లకు విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 7: విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలోనూ రాణించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల మైదానంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాల ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ అథ్లెటిక్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో వసతి గృహాల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో స్నేహభావం, ఏకాగ్రత, మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రథమ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సజీవన్, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మీనారెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

చింతలమానేపల్లి, జనవరి 7: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎంహెచ్‌వో సీతారాం ఆదేశించారు. వీరంద్ర నగర్‌లో గల బాబాపూర్ పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలు, పిల్లలకు సికిల్ సెల్ అనిమియా స్కీనింగ్ చేసి.. రక్తం తక్కువగా ఉన్న వారికి మందులు అందించాలన్నారు. మండలంలో సుమారు 5 వేల మంది రక్త నమూనాలు సేకరించాలన్నారు. రక్తహీనత, విపరీతమైన నొప్పి, చేతులు, కాళ్లు, వాపు సికిల్‌సెల్ అనిమియా సాధారణ లక్షణాలు అని తెలిపారు. మండలంలో వెయ్యి మంది రక్త నమూనాలు సేకరించినట్లు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అజీముద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజ్మీరా రాజ్‌కుమార్ ఉన్నారు.